● వీధికుక్కలతో బెంబేలు



వీధికుక్కల బెడద రోజురోజుకూ ఎక్కువవుతోంది. ప్రత్యేకించి బైక్‌లపై నైట్‌డ్యూటీకి వెళ్లే వారిపైకి ఎగబడుతూ తరుముతున్నాయి. కొన్నిచోట్ల గుంపులుగా తిరుగుతూ చిన్నపిల్లలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే డెలివరీ బాయ్స్‌ను సైతం వీధికుక్కలు వదలటం లేదు. ఇటీవలే గాయత్రినగర్ కాలనీలోని ఓ అపార్టుమెంటుకు వచ్చిన ఫుడ్ డెలివరీ బాయ్‌ని వీధికుక్క తరమడంతో కిందపడి గాయాలపాలయ్యాడు.

- అల్లాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

నిబంధనలు అతిక్రమిస్తే ఇబ్బందులే.!

● అనుమతి ఇచ్చేది ఒకరు.. ఒత్తిడి మాత్రం మాకు
● హైడ్రా తరహాలో టౌన్‌ప్లానింగ్‌కు ఫోర్స్ ఉండాలి
● 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కూకట్‌పల్లి టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్‌కుమార్

ఇంటర్వ్యూ



రమేష్ కుమార్

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'టౌన్‌ప్లానింగ్‌లో ఉద్యోగం అంటే కత్తిమీద సామేనని, అనుమతులు ఇచ్చేది జోనల్ లేదా జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం... కానీ ఆరోపణలు మాత్రం మేము భరించాల్సిందే. మాకు ఉండే పరిమితులు బాహ్య ప్రపంచానికి తెలియవు. హైడ్రా తరహాలో టౌన్‌ప్లానింగ్‌కు కూడా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుకు తగినంత సిబ్బందిని నియమించాలని కూకట్‌పల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ టీఎల్ రమేష్‌కుమార్ మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన తర్వాత ఎలా కట్టుకున్నా పట్టించుకోరనే విమర్శలున్నాయి. నిజమేనా?

సర్కిల్ పరిధిలో మేము అనుమతులు ఇచ్చేది స్టిల్ట్ ప్లస్ 3 మాత్రమే. ఇవన్నీ నివాస సముదాయాలు. కానీ అపార్ట్‌మెంట్లు, షెడ్లు నిర్మిస్తున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నాయి. ఇవన్నీ జోనల్ లేదా జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి అనుమతులు తీసుకొని ఉంటారు. సమస్య వచ్చినప్పుడు మాత్రం మమ్మల్ని చూడమంటారు. అంతే తప్పా.. వారిపై అజమాయిషీ అంటూ ఏమి ఉండదు.

టౌన్‌ప్లానింగ్‌లో ఉద్యోగులు, సిబ్బంది కొరత ఉందా.

మా పరిధిలో హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్‌కు ఒక న్యాక్ ఇంజనీర్ ఉండాలి. కానీ ఆరు మంది ఉండాల్సిన చోట ముగ్గురే ఉన్నారు. డివిజన్‌కు ఒక టీపీఎస్ అవసరం కానీ సర్కిల్ మొత్తానికే ఒక్కరే ఉన్నారు. దీంతో పర్యవేక్షణలో జాప్యం జరుగుతోంది. ఉద్యోగులు, సిబ్బంది కొరత కారణంగా ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వలేకపోతున్న మాట వాస్తవమే. కానీ ఉన్న వారితోనే పని చేయించుకుంటూనే ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు నివేదిస్తున్నాం.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకుంటలేరంట.

మేము క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. తొలుత మేము నోటీసులు ఇచ్చిన తర్వాత వారం రోజుల్లో స్పందించకపోతే మరో నోటీసు ఇస్తాం. ఆలోగా కోర్టు నుంచి స్టే తెచ్చుకుంటే మేము అందులో తలదూర్చలేం. నిర్మాణదారులు నోటీసులకు స్పందించకుంటే మాత్రం ఎస్‌టీఎఫ్ (స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీం)కు రాస్తాం. అంతే తప్పా మేము కూల్చడానికి మా దగ్గర టీం లేదు. సరిపడా సిబ్బంది కూడా లేరు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలంటే ఏం చేయాలి.

జీహెచ్‌ఎంసీలో సర్కిల్‌కు ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ఉండాలి. ఫిర్యాదు వచ్చినా.. రాకున్నా అనుమతులు లేకుండా నిర్మించినా, నిబంధనలు అతిక్రమించినా వెంటనే ఆ నిర్మాణాలను నేలమట్టం చేయాలంటే ఇప్పుడు మేము ఎస్‌టీఎఫ్‌కు నివేదించాల్సి వస్తుంది. అక్కడ కూడా ప్రత్యేకంగా అధికారులు లేరు.. అడిషనల్ బాధ్యతలు కావడంతో వారికి కూడా పనిభారం వల్ల ప్రాధాన్యతా క్రమంలో ఆక్రమణలను కూల్చడం లేదా సీజ్ చేయడం జరుగుతుంది. ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమిస్తే బాగుంటుంది.

ప్రజలకు మీరు ఇచ్చే సందేశం ఏంటి ?

అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవన నిర్మాణదారులు ఎప్పటికైనా ఇబ్బందులు పడాల్సిందే. అధికారులు ఇచ్చిన అనుమతుల ప్రకారం ఇల్లు లేదా భవనాలు, వాణిజ్య సముదాయాలు నిర్మించుకుంటే ఎవ్వరికీ భయపడాల్సిన అవసరం ఉండదు. అక్రమ భవనంలో ఉంటూనే వేరే వారు అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్నారంటూ మాకు ఫిర్యాదులు వస్తుంటాయి. ప్రజాప్రయోజనాల కోసం అయితే ఓకే .. కొందరు స్వార్థప్రయోజనాల కోసం మాపై ఒత్తిడి తెస్తున్నారు.

చెత్త రహిత డివిజన్ కోసం కార్మికులు సహకరించాలి



పారిశుధ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌ను చెత్తరహిత డివిజన్‌గా మార్చేందుకు పారిశుధ్య సిబ్బంది సహకరించాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పారిశుధ్య సిబ్బందికి సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పారిశుధ్య సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలానగర్ ఫ్లై ఓవర్‌కు రెండు వైపుల చెత్త లేకుండా శుభ్రంగా ఉడ్వాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డివిజన్ జనరల్ సెక్రటరీ ఖాజ, మహేందర్‌రెడ్డి, శానిటేషన్ ఎస్సార్పీ నర్సింగ్‌రావు, బోళాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

● వ్యర్థాల తొలగింపు ప్రక్రియ



జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోన్‌లో తొలి దశలో కూకట్‌పల్లి, మూసాపేట్, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో వారం రోజుల్లో సీ అండ్ డీ 255.5 టన్నులు, అలాగే పాత చెత్త 56.4 టన్నులను తొలగించినట్లు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు కూడా చెత్తాచెదారం, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో ప్రారంభం అవుతుందన్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

● అన్నసమారాధన



కూకట్‌పల్లి శివానంద రిహాబిలిటేషన్ సెంటర్‌లో మంగళవారం అస్క్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ వసుమతి, శివకుమార్ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఎరవెల్లి జగన్, లకావత్ భానుప్రకాష్ నాయక్, హేమంత్, రూప్‌సింగ్, దేవి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదర్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో చేసిన అభివృద్ధి ప్రజలు మరచిపోలేదని, వేలకోట్లతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు వెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, ఇప్పటికే ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారన్నారు. ఎక్కడ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, జనరల్ సెక్రటరీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● కూకట్‌పల్లి ఏవీబీపురానికి చెందిన పి. అజ్జేశ్వరి అనారోగ్యంతో ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. ఆమెకు మంజూరైన రూ.75 వేల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

హైడ్రా హడలెత్తించనుందా?

● ఫుట్‌పాత్ ఆక్రమణదారుల్లో టెన్షన్
● స్థానిక నేతలతో మంతనాలు
● ఆక్రమణల తొలగింపుపై స్థానికుల ఎదురుచూపులు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో హైడ్రా పేరు వింటేనే ఆక్రమణదారులు, ఫుట్‌పాత్ వ్యాపారుల గుండెలో వణుకు పుడుతోంది. హైడ్రా అధికారులను అడ్డుకునేందుకు ఏం చేయాలని, తమ వ్యాపారాలు పోకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, స్వచ్ఛందంగానే తొలగించుకోవాల్సి వస్తుందా.. లేదంటే స్థానిక నాయకులతో చర్చించాలా అంటూ చిరు వ్యాపారులు చర్చించుకుంటున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు ప్రక్రియ హైడ్రాకు అప్పగించడంతో కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, భాగ్యనగర్‌కాలనీ, మూసాపేట్ ప్రాంతాల్లో ఎక్కడ చూస్తున్నా ఇవే చర్చలు వినిపిస్తున్నాయి. ఆక్రమణల తొలగింపు ప్రక్రియ అంత సులువైన పనేమి కాదని అధికారులే చర్చించుకుంటుండటం గమనార్హం.

ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు

గత ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారికి ఇరువైపులా అలాగే కాలనీల్లో ప్రధాన మార్గాల్లో ఫుట్‌పాత్‌లను అందంగా తీర్చిదిద్దారు. రోడ్డువైపు రెయిలింగ్‌తో పాటు టైల్స్‌తో అభివృద్ధి చేయడంతో పాదాచారులకు ఎంతో ఉపయోగం ఉంటుందని అందరూ ఆశించారు. కానీ కొందరు చిరువ్యాపారుల ముసుగులో ఫుట్‌పాత్‌లపై తిష్టవేశారు. దీంతో కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన ఫుట్‌పాత్‌లపై చాయ్ డబ్బాలు, కూరగాయల విక్రయాలు, టిఫిన్ సెంటర్లు, టాయ్స్, పూల మొక్కలు, బట్టల దుకాణాలు వెలశాయి. ఫుట్‌పాత్ వ్యాపారులతో ట్రాఫిక్ సిబ్బంది నెలవారీ మాముళ్ల వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రాందేవ్‌రావు ఆస్పత్రి, కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1, కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ నుంచి మియాపూర్ మెట్రోస్టేషన్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా, కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపు, కేపీహెచ్‌బీ నాలుగు, ఏడో ఫేజ్‌లు, నెక్సస్ మాల్ నుంచి గోకుల్ చౌరస్తా, కేపీహెచ్‌బీ ఈ సేవా రోడ్డు, సర్దార్‌పటేల్‌నగర్ ప్రాంతా ల్లో ఫుట్‌పాత్‌లపై వందల దుకాణాలు స్థానిక నేతల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి అద్దెకు ఇచ్చుకున్న వారిలో ఎక్కువ మంది ఇప్పుడు ఏం చేయాలో అర్థంకాక అయోమయానికి గురవుతున్నారు. గతంలో మాదిరిగా తమకు సహకరించిన జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు సమాచారం.



రాందేవ్‌రావు ఆస్పత్రి ఎదుట జాతీయ రహదారిపై ఉన్న ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు



కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1 ప్రసాద్ ఆస్పత్రి ఎదుట ఫుట్‌పాత్‌పై నిలిపిన బైక్‌లు, కార్లు

హైడ్రాతో మారనున్న రూపురేఖలు

హైడ్రా కమిషనర్ రంగంలోకి దిగితే ఆ ప్రాంతంలో రూపురేఖలు మారుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఫుట్‌పాత్ ఆక్రమణదారులతో కుమ్మక్కై వ్యాపారాలు సాగించుకునేలా ప్రోత్సహిస్తున్న అధికారులు, సిబ్బంది దీనికి వ్యతిరేకంగా మాట్లాడటం మొదలు పెట్టారు. ఎవరెన్ని చెప్పినా ఆ సమయంలో హడావిడీ చేయడమే కానీ క్షేత్రస్థాయిలో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించడానికి ఇప్పటి వరకు ఎవ్వరూ కృషి చేసిన పాపాన పోలేదు. ఒక్క కూకట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద అప్పటి జడ్సీ అభిలాష అభినవ్ ఆక్రమణలను తొలగించడం మినహాయిస్తే.. ఇప్పటి వరకు అలాంటి పనులు ఎక్కడా జరగలేదు.

తొలగింపుపై స్థానికుల ఎదురుచూపు

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ఎప్పుడు ప్రారంభిస్తారోనని కేపీహెచ్‌బీ పరిసర ప్రాంత ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. లేక్స్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఆక్రమణల తొలగింపు సమయంలో ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా అనుకున్న పని పూర్తి చేశారు. అదే తరహాలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తారని, ఫుట్‌పాత్‌లన్నీ పాదాచారులకు అందుబాటులోకి వస్తాయని జనం నమ్ముతున్నారు. హైడ్రా ఎప్పుడు? ఎలా? చేయబోతుందో చూడాలి మరి.



ఎంపీ ఈటలను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

భరత్‌నగర్‌లో ఎంపీ ఈటల పర్యటన

ఫతేనగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ మంగళవారం ఫతేనగర్ డివిజన్ భరత్‌నగర్‌లో పర్యటించారు. భరత్‌నగర్‌లో ఉన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భరత్‌నగర్ పార్కులో డివిజన్ నాయకులు వాకర్స్ అసోసియేనషన్ సభ్యులతో సమావేశమయ్యారు. భరత్‌నగర్ కాలనీలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరంగా ఉందని రాక పోకలకు ఇబ్బందికరంగా ఉందని సభ్యులు తెలియజేయడంతో ఫోన్ ద్వారా ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి చిరువ్యాపారులకు ఎలాంటి నష్టం జరుగకుండా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, సీనియర్ నాయకుడు రామ్మోహన్ పాల్గొన్నారు.

ఓల్డుబోయినపల్లి డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన



హస్మత్‌పేట చెరువు, హిందూ శ్మశానవాటికను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డుబోయినపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్ మంగళవారం డివిజన్‌లో విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదట ముత్యాలమ్మ ఆలయ దాడిలో గాయపడిన సాయికుమార్‌గౌడ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం కూకట్‌పల్లి సర్కిల్ ఈఈ గోవర్ధన్‌గౌడ్, డివిజన్ ఏఈ ఆశ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌గౌడ్, రామ్‌కీ సంస్థ ప్రతినిధి అరుణతో కలిసి హస్మత్‌పేట హిందూ శ్మశాన వాటిక, బోయిన్‌చెరువును సందర్శించారు. బోయిన్ చెరువు వద్ద ఉన్న మురుగునీటి కాలువలో పేరుకు పోయిన చెత్తను తొలగించాలని అధికారులకు సూచించారు.

● మరో కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధి గంగపుత్ర సంఘంలో ఉన్న మహంకాళీ ఆలయ 24వ వార్షిక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు కార్పొరేటర్‌ను శాలువా సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్రసంఘం నాయకులు జనార్దన్, అధ్యక్షుడు దానయ్యరాజు, సత్యనారాయణ, శ్రీరాములు, శివ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పాట్నా టీటీఎఫ్‌లో ఆకట్టుకుంటున్న బుద్ధవనం స్టాల్



పాట్నా టీటీఎఫ్‌లో తెలంగాణ పర్యాటక సంస్థ బుద్ధవనం ప్రాజెక్టు స్టాల్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బిహార్‌లో జరుగుతున్న ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్ (టీటీఎఫ్)లో తెలంగాణ పర్యాటక సంస్థ ఏర్పాటు చేసిన నాగార్జునసాగర్ బుద్ధవనం ప్రాజెక్ట్ పలువురిని విశేషంగా ఆకట్టుకుంటోంది. బిహార్ రాజధాని పాట్నాలో సామ్రాట్ కాంప్లెక్స్, జ్ఞానభవన్‌లో తెలంగాణ టూరిజం-బుద్ధవనం స్టాల్‌ను మంగళవారం కేంద్రపర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ప్రారంభించారు. పాట్నా టీటీఎఫ్‌లో బుద్ధవనం, బౌద్ధవారసత్వ థీమ్‌పార్కుతోపాటు యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లాలోని పాలంపేట్‌లోని రా మప్ప దేవాలయం, హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ప్రపంచ వారసత్వ స్మారక చిహ్నాలను ఈ సందర్భంగా గజేంద్రసింగ్ షెకావత్ సందర్శించారు. ఆయా పర్యాటక కేంద్రాల చారిత్రాత్మక ప్రాశస్త్యాన్ని తెలుసుకుని త్వరలో తెలంగాణకు రానున్నట్టు తెలిపారు. తెలంగాణను ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా అభివృద్ధి చేసే విషయాల పై సమగ్రంగా చర్చించేందుకు డిల్లీలోని తన కార్యాలయానికి రావాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డిని ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా బౌద్ధచరిత్రకారుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలంగాణలోని పర్యాటక కేంద్రాల ప్రాధాన్యతను విశ్లేషించారు. కార్యక్రమంలో పర్యాటక సంస్థ జనరల్ మేనేజర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి జి.ఆశన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పథకం ద్వారా కులవృత్తిదారులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారులు, చెప్పులు కుట్టువారు, మేస్త్రీ, బుట్టలు, చాపలు, చీపుర్లు తయారీదారులు, కొబ్బరిపీచు అల్లేవారు, బొమ్మల తయారీదారులు, మంగలి, పూలమాలలు అల్లేవారు, రజకులు, టైలర్, మత్స్యకారులు, వలలు తయారుచేసేవారు అర్హులన్నారు. చేతులు, పనిముట్లతో పనిచేస్తూ, కుటుంబ సంప్రదాయ వృత్తుల్లో నిమగ్నమైన హస్తకళాకారులు, వృత్తికళాకారులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ తేదీ నాటికి దరఖాస్తుదారుడి వయసు కనీసం 18 ఏళ్లు ఉండాలని, గత ఐదేళ్లలో స్వయంఉపాధి, వ్యాపార అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద రుణం పొందకుండా ఉండాలన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే సాయం అందుతుందని తెలిపారు.

ఆలయాలపై దాడులు తగదు



నిరసన తెలియజేస్తున్న హిందూ సంఘాల సభ్యులు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయంపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బాలాజీనగర్ బీజేపీ ప్రధాన కార్యదర్శి కర్ర వేణుగోపాల్ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీలో నిరసన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. హిందువులు మేల్కొని హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుప్తా, సన్నీతేజ, శేఖర్, సాయి, యాదవరెడ్డి, రాజేష్ ప్రభు, సాయిప్రసాద్, సాయితేజ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో దంతవైద్య శిబిరం

అల్లాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రినగర్ కాలనీ సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫోరం అధ్యక్షుడు కందనూరు సూరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాయత్రినగర్‌లోని వాటర్ ట్యాంక్ పార్కులో గల సీనియర్ సిటిజన్స్ ఫోరం హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న ఈ శిబిరంలో దంత సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, దంతరోగ్యం పట్ల అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వివేక్ డెంటల్ ప్రతనిధి డా. వివేక్ తదితరులు తెలిపారు.

గుండెపోటుతో మధ్యాహ్న భోజన కార్మికురాలి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు మారగోని ఉమ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విజయవాడ జాతీయ రహదారిపై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయం



కేపీహెచ్‌బీ ఏడో ఫేజ్ మెయిన్‌రోడ్డులో..

వాహనదారులకు తప్పని తిప్పలు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కేపీహెచ్‌బీ ఐదు, ఏడో ఫేజ్, వసంతనగర్ మెయిన్‌రోడ్డు, జేఎన్‌టీయూ రోడ్డు, కైత్లాపూర్, మూసాపేట్ ఆంజనేయనగర్ ప్రధాన మార్గాల్లో రోడ్లపై నీరు నిలిచింది. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లపై నీరు చేరడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకుంటే తప్పా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని ఆయా ప్రాంత ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



కేపీహెచ్‌బీ ఐదో ఫేజ్ మెయిన్ రోడ్డులో..

'దానా' తుఫాన్ ప్రభావంతో

41 రైళ్లు రద్దు

నేటి నుంచి 27 వరకు పలు మార్గాల్లో రైళ్ల నిలిపివేత

హైదరాబాద్‌సిటీ, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): 'దానా' తుఫాన్ ప్రభావంతో తూర్పు కోస్తా, దక్షిణ మధ్య రైల్వేల పరిధిలోని వివిధ మార్గాల్లో మొత్తం 41 రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు మంగళవారం ఒక ప్రటకలో పేర్కొన్నారు. ఒడిశా తీరప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకూ పలు రైళ్లను ఎక్కడికక్కడే నిలిపివేస్తున్నట్లు సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. ప్రధానంగా రద్దయిన రైళ్లలో భువనేశ్వర్, హౌరా, ఖరగ్‌పూర్, పూరీ తదితర ప్రాంతాల నుంచి బెంగళూరు, రామేశ్వరం, సికింద్రాబాద్, తిరుపతి, షాలీమార్, మాల్డా, గౌహతి, కన్యాకుమారి, చెన్నై, గోవా తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు.

దీపావళి, ఛత్‌కు 804 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి, ఛత్ పండుగల సందర్భంగా 804 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్యరైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ప్రధాన రైల్వేస్టేషన్‌లు సికింద్రాబాద్, కాచిగూడ తదితర కేంద్రాల నుంచి షాలిమార్, రక్సాల్, జైపూర్, లాల్‌ఘర్, హిసార్, గోరక్‌పూర్, షిర్డీ, దానాపూర్, నిజాముద్దీన్, కటక్, అగర్తల, సంత్రగచ్చి తదితర ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు అత్యధికంగా రైళ్లను నడుపుతున్నట్లు తెలిపారు. మధురై, ఈరోడ్, నాగర్‌కోయిల్, కొల్లాం, బెంగళూరు, పన్వేల్, దాదర్ తదితర ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నవంబర్ 30 వరకు దాదాపు 6,556 ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు.

కాచిగూడ-తిరుపతి స్పెషల్ రైలు రద్దు

బర్కత్‌పుర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన కాచిగూడ-తిరుపతి స్పెషల్ రైలు(07063)కు ప్రయాణికుల ఆదరణ లేకపోవడం వల్ల రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ప్రయాణికులు ఎవరూ టికెట్ బుక్ చేసుకోలేదని ఆయన పేర్కొన్నారు.

యువతి అదృశ్యం



తిమ్మమ్మ

మియాపూర్: అనుమానాస్పదస్థితిలో ఓ యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాఫీజ్‌పేట వినాయక్‌నగర్ వడ్డెర బస్తీకి చెందిన హనుమయ్య కుమార్తె తిమ్మమ్మ(30) ఈనెల 18న అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె సోదరులు రాముడు, లక్ష్మణ్ ఆమె కోసం బంధువులు తెలిసిన వారిని విచారించారు. యువతి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రజల సహకారంతోనే పారిశుధ్య నిర్వహణ సాధ్యం

డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఏఎంహెచ్ఓ శేరిలింగంపల్లి

ఇంటర్వ్యూ...



ఖేల్‌కాలనీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని పలు కాలనీలు..బస్తీల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీనిపై దృష్టి సారిస్తున్న అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అధికారులు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తుండగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. పారిశుధ్య నిర్వహణపై శేరిలింగంపల్లి సర్కిల్-20 ఏఎంహెచ్ఓ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు..

చెత్త తరలింపుపై తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

శేరిలింగంపల్లిలో సేకరించిన చెత్త తొలగింపు ప్రధాన సమస్యగా మారింది. డంపింగ్ యార్డు దూరంగా ఉండడం, విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ వల్ల గతంలో కంటే నేడు చెత్త తరలింపు కష్టతరమైయింది. ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తూ ఎప్పటికప్పుడు చెత్తను తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

ఎంతమంది పారిశుధ్య సిబ్బంది ఉండాలి.. ఎంతమంది ఉన్నారు.?

శేరిలింగంపల్లిలోని కాలనీలు, బస్తీలు, ప్రధాన ప్రాంతాల్లో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టేందుకు 1400 మంది సిబ్బంది ఉండాలి. 587 మంది మాత్రమే తీసుకోగా కేవలంగా మూడు వందల మంది మాత్రమే విధులకు హాజరవుతున్నారు.

ఎలాంటి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు?

పారిశుధ్య నిర్వహణపై మొదటి సారిగా వినూత్న రీతిలో ఎంఎస్‌టీ (మొబైల్ శానిటేషన్ టీం)ను ఏర్పాటు చేసాం. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రధాన ప్రాంతాల్లో, రోడ్లపై చెత్త తొలగింపును చేపడుతుంది. జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి పర్యవేక్షణలో వివిధ విభాగాల అధికారుల సహకారాలతో ఎంఎస్‌టీ పనులను చేపడుతుంది.

చెత్త సమస్య పరిష్కారం అవ్వాలంటే ఎటువంటి చర్యలు చేపట్టాలి?

ప్రజల భాగస్వామ్యంతో నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం. బహిరంగా ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఇంటింటికీ వచ్చే వాహనాల్లో చెత్త వేయాలి.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవ్వాలి. అప్పుడే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?

- అడుగడుగునా గుంతలతో నిత్యం ప్రమాదం
- ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు కష్టాలు



మియాపూర్, దీప్తిశ్రీనగర్‌లో ధ్వంసమైన రహదారులు

మియాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్ల దుస్థితిపై అధికారులు గత ఏడాది కాలం చేతులు ఎత్తేశారు.. రెండు మూడు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో అంతర్గత ప్రధాన రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అంతంతమాత్రంగా ఉన్న ఈ రహదారులు ప్రస్తుతం గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారుల్లో రోడ్లు గుంతలమయంగా మారడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి, వాహనాలు నెమ్మది వెల్లడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మియాపూర్ నుంచి కృషినగర్‌కు వెళ్లే నూతన రోడ్డు నిర్మాణం చేపట్టి మూడు నెలలు గడిచిన పూర్తిగా రోడ్డు వేయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మరోపక్క దీప్తిశ్రీనగర్ నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న చెత్త డంపింగ్ యార్డుకు వెళ్లే అన్ని రహదారులు ధ్వంసమయ్యాయి. హెచ్ఎంటీ స్వర్ణపురి, మక్తామహబూబ్‌పేట, చెరువుకట్ట ప్రధాన రహదారి, జేపీఎన్‌నగర్‌కు వెళ్లే అంతర్గత రహదారులు పూర్తిగా ధ్వసంమయ్యాయి. చందానగర్ హుడా కాలనీ నుంచి మంజీర పైపులైన్ రోడ్డులో పైపులైన్ల కోసం రోడ్డును తవ్వి వదిలేశారు. గోకుల్‌ప్లాట్స్‌లో అంతర్గత రహదారులు, హైటెన్షన్ రోడ్డు, హఫీజ్‌పేట రైల్వేస్టేషన్ వరకు ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, రాఘవేంద్రకాలనీ, శ్రీరాంనగర్, నల్లగండ్లలోని ప్రధాన రహదారులు, చందానగర్‌లోని బీహెచ్ఈఎల్ చౌరస్తా రోడ్లు ధ్వంసమయ్యాయి. చాలా రహదారులు ఎక్కడబడితే అక్కడ ప్రమాదాలు జరగకుండా, ట్రాఫిక్ సమస్య లేకుండా గుంతలైన పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



దీప్తిశ్రీనగర్ ప్రాంతంలోని ప్రధాన అంతర్గత రహదారులతో పాటు మియాపూర్‌లోని పలు రహదారులు ధ్వంసమయ్యాయి. అనేక సార్లు రోడ్లు నిర్మించినా నాణ్యత లేకపోవడంతో కొన్ని రోజులకే గుంతలమంగా మారాయి. అధికారులు ఈ ప్రాంతంలో నూతన రోడ్లు వేయడంతో పాటు గుంతలు పూడ్చాలి.

- పి.వాసు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

రోడ్లకు మరమ్మతులు చేయాలి



మియాపూర్‌లోని అన్ని ప్రాంతాల్లో కొత్త రోడ్లు నిర్మించాం. భారీ వాహనాలు, వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించి కాలనీల్లో పర్యటించి గుంతలను గుర్తించి మరమ్మతులు చేయాలని అధికారులను కోరాను. త్వరలోనే అన్ని రోడ్లు మరమ్మతులతో పాటు అవసరమైన చోట కొత్తగా రోడ్లు వేస్తాం.

-ఉప్పలపాటి శ్రీకాంత్, మియాపూర్ కార్పొరేటర్

సరస్వతీ శిశుమందిర్ అభివృద్ధికి రూ.50 వేల విరాళం



రూ.50 వేల చెక్కును ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న కలివేముల సాహితీ

మియాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మియాపూర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు కలివేముల మనోహర్ కుమార్తె సాహితీ పుట్టినరోజు సందర్భంగా దుండిగల్‌లోని శిశుమందిర్ పాఠశాల అభివృద్ధికి తన నెల జీతం రూ.50 వేలు సరస్వతి విద్యా పీఠం దుండిగల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమన్నారాయణకు అందజేశారు. 9 ఏళ్లుగా ప్రతి ఏటా ఈ విధంగా ఆర్థిక సాయం చేస్తున్నట్లు మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెను అభినందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



ఎల్లమ్మబండ దత్తాత్రేయ కాలనీలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ దత్తాత్రేయ కాలనీలో సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో గడువులోగా పనులుపూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు శివరాజ్‌గౌడ్, జగదీష్, నాగభూషణం, మల్లేష్, సంతోష్, భూమి, నాగేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్-ఇస్నాపూర్ వరకు మెట్రో నిర్మాణం చేయాలి



మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు

మియాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో నిర్మాణంలో భాగంగా నాగపూర్ నమూనా ప్రకారం ఫ్లై ఓవర్‌ను ఒకే పిల్లర్ మీదుగా వచ్చే విధంగా నూతనంగా నిర్మాణం చేపట్టాలని మంత్రి శ్రీధర్‌బాబుకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మెట్రో మార్గం, ఫ్లై ఓవర్‌ను ఒకే పిల్లర్ మీదుగా వచ్చే విధంగా నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రిని కోరారు.

ప్రజల మెరుగైన జీవన ప్రమాణాల కోసం, ట్రాఫిక్ రహిత సమాజం కోసం మెట్రో విస్తర్ణపై గతంలో అసెంబ్లీలో కూడా మాట్లాడానని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరితిని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కమిషనర్‌తో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులు, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు పూర్తియ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సకాలంలో నిధులు మంజూరయ్యేలా చూడాలని, అభివృద్ధి పనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు మరమ్మతులు చేయాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదర్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో చేసిన అభివృద్ధి ప్రజలు మరచిపోలేదని, వేలకోట్లతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు వెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, ఇప్పటికే ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారన్నారు. ఎక్కడ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, జనరల్ సెక్రటరీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

- కూకట్‌పల్లి ఏవీబీపురానికి చెందిన పి. అజ్జేశ్వరి అనారోగ్యంతో ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. ఆమెకు మంజూరైన రూ.75 వేల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

నాయనమ్మకుంట చెరువును సుందరంగా తీర్చిదిద్దుతాం

- కార్పొరేటర్ శ్రీకాంత్



నాయనమ్మకుంట చెరువును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ లక్ష్మీనగర్ కాలనీలోని నాయనమ్మకుంట చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఇరిగేషన్ అధికారులతో కలిసి మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మంగళవారం చెరువును పరిశీలించారు. చెరువుకట్ట బలోపేతం, మురుగునీరు చెరువులో కలవకుండా కాల్వ నిర్మాణం, అలుగు, మరమ్మతులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడతామని తెలిపారు. చెరువు చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాని వివరించారు. నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీపడకుండా పనులు వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.

బ్రహ్మోత్సవాలకు రారండోయ్..

- నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేడుకలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం



స్వామివారి ఆలయ గోపురం

చందానగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నిత్యం పూజలు... ఉత్సవాలు.. కల్యాణాలు, అన్నదానం వంటి కార్యక్రమాలతో విరాజిల్లుతున్న చందానగర్ వేంకటేశ్వర దేవాలయం 29వ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆలయ స్థాపించి 29 ఏళ్లు అయిన సందర్భంగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో శేషవాహన సేవ, హనుమాన్ వాహన సేవ, సింహ వాహనసేవ, గరుడ వాహన సేవ, రథోత్సవం, పుష్పవాహనం, కార్యక్రమాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తుంది. చందానగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధ క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. 1995లో స్థానిక భక్తుల సంకల్పంతో టీటీడీ దేవస్థానం నుంచి స్వామివారి మూలవిరాట్‌ను తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతిమాసం శ్రావణ నక్షత్రంరోజు పద్మావతి, గోదాదేవి సమేత వెంకన్నస్వామి కల్యాణం చేయడం మొదలు పెట్టారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి. మహిళలు బృందాలుగా లలిత సహస్రపారాయణం, హనుమాన్ చాలిసా భక్తిశ్రద్ధలతో పఠనం చేస్తారు. ప్రతియేట ఇక్కడ చేపట్టే ఆలయ బ్రహ్మోత్సవాలు, లక్ష కుంకుమార్చన, మహాపుష్ప యాగం, లక్ష బిల్వార్చన కార్యక్రమాల్లో పాల్గొని తరిస్తుంటారు. కార్తీకమాసం, శ్రావణమాసంతో పాటు ముక్కోటి ఏకాదశి తిరుపడసేవ సందర్భాల్లో భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది.

- **కార్యవర్గ కమిటీ సభ్యులు వీరే...**

ఆలయ కార్యవర్గం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.రామచంద్రరాజు, అధ్యక్షుడు కె.రఘుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు టి.సుబ్బారాయుడు, అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి టి.సుభాష్, కోశాధికారి అశోక్‌కుమార్, ఉపకార్యదర్శి దేవేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కె.వెంకటశేషయ్య, ఎస్.నాగేశ్వర్‌రావ, బ్రహ్మయ్యగుప్త, రాంగోపాల్, వి.శ్రీకాంత్ చందానగర్ ప్రధాన కూడళ్లలో భారీగా కటౌట్‌లు, దేవాలయాన్ని విద్యుత్ దీపాలను అలంకరించారు. ప్రధాన అర్చకులు సుదర్శన సత్యసాయి హోమాలు, యాగాల నిర్వహణ కోసం యాగశాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు విశాఖశారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర్ పీఠాధిపతి తస్మేంద్ర మహాస్వామి పర్యవేక్షణలో నేటి నుంచి 28వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు ఆలయ కమిటీ చేసింది.

బ్రహ్మోత్సవాలకు రాఘవరావు, ప్రీతంకు ఆహ్వానం



మిర్యాల రాఘవరావు, ప్రీతంకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు సత్యసాయి సుదర్శనం

చందానగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చందానగర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం విశాఖ శారద పీఠం శాశ్వత సభ్యుడు మిరియాల రాఘవరావు, ప్రీతంకు ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం సత్యసాయి ఆహ్వన పత్రికను అందజేశారు. ఈ వేడుకల్లో ప్రతిరోజు రాఘవరావు, ప్రీతం ప్రత్యేక పూజలు చేయనున్నారు. కార్యక్రమంలో కోశాదికారి అశోక్‌కుమార్, త్రినాథ్ ఉన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారంలో భాగంగా..
సైబరాబాద్‌లో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేసి ప్రశంసా పత్రాలు అందుకున్న సిబ్బందితో సీపీ

- **464 యూనిట్ల రక్తం సేకరణ**

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారంలో భాగంగా సైబరాబాద్ పోలీసులు గచ్చిబౌలిలోని కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌తో కలిసి సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి ప్రారంభించారు. అనంతరం ఈ రక్తదానంలో సైబరాబాద్ పోలీసులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. తలసేమియా, బ్లడ్ క్యాన్సర్, హీమోఫీలియా, రోడ్డు ప్రమాద బాధితులకు రక్తం చాలా అత్యవసరం అని, రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సిబ్బందితో పాటు.. సీపీ, జాయింట్ సీపీ రక్తదానం చేశారు. సీపీ పిలుపు మేరకు సిబ్బంది ఎక్కువ సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. సైబరాబాద్ పోలీసుల తరఫున మొత్తం 464 యూనిట్ల రక్తాన్ని సేకరించి అందజేశారు. రక్తదాన శిబిరాన్ని పెద్దఎత్తున విజయంతం చేసిన సిబ్బందికి సీపీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ షమీర్, ఏసీపీ అరుణ్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఎస్సీఎస్సీ (సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్) ప్రతినిధులు, స్టాఫ్ పాల్గొన్నారు. రక్తదాతలకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలు అందజేశారు.

'దానా' తుఫాన్ ప్రభావంతో 41 రైళ్లు రద్దు

27 వరకు పలు మార్గాల్లో రైళ్ల నిలిపివేత

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'దానా' తుఫాన్ ప్రభావంతో తూర్పు కోస్తా, దక్షిణ మధ్య రైల్వేల పరిధిలోని వివిధ మార్గాల్లో మొత్తం 41 రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు మంగళవారం ఒక ప్రటకలో పేర్కొన్నారు. ఒడిశా తీరప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకూ పలు రైళ్లను ఎక్కడికక్కడే నిలిపివేస్తున్నట్లు సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు.

ప్రధానంగా రద్దయిన రైళ్లలో భువనేశ్వర్, హౌరా, ఖరగ్‌పూర్, పూరీ తదితర ప్రాంతాల నుంచి బెంగళూరు, రామేశ్వరం, సికింద్రాబాద్, తిరుపతి, షాలీమార్, మాల్దా, గౌహతి, కన్యాకుమారి, చెన్నై, గోవా తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు.

పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జి.ఆశన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పథకం ద్వారా కులవృత్తిదారులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారులు, చెప్పులు కుట్టువారు, మేస్త్రీ, బుట్టలు, చాపలు, చీపుర్లు తయారీదారులు, కొబ్బరిపీచు అల్లేవారు, బొమ్మల తయారీదారులు, మంగళి, పూలమాలలు అల్లేవారు, రజకులు, టైలర్, మత్స్యకారులు, వలలు తయారుచేసేవారు అర్హులన్నారు.

చేతులు, పనిముట్లతో పనిచేస్తూ, కుటుంబ సంప్రదాయ వృత్తుల్లో నిమగ్నమైన హస్తకళాకారులు, వృత్తికళాకారులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ తేదీ నాటికి దరఖాస్తుదారుడి వయసు కనీసం 18 ఏళ్లు ఉండాలని, గత ఐదేళ్లలో స్వయం ఉపాధి, వ్యాపార అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద రుణం పొందకుండా ఉండాలన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే సాయం అందుతుందన్నారు.

యువతి అదృశ్యం



తిమ్మమ్మ

మియాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువతి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హఫీజ్‌పేట వినాయక్‌నగర్ వడ్డెర బస్తీకి చెందిన హనుమయ్య కుమార్తె తిమ్మమ్మ(30) ఈ నెల 18న అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె సోదరుడు రాముడు, లక్ష్మణ్ బంధువు లను తెలిసిన వారిని విచారించిన ఆచూకీ తెలియ లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పబ్‌లలో పోలీసుల తనిఖీలు

మాదాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ జోన్‌లోని సుమారు 17 పబ్‌లలో మంగళవారం రాత్రి సైబరాబాద్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పబ్‌ల లైసెన్స్‌లను తనిఖీ చేశారు. నిర్దీత గడువు లోపు లైసెన్స్ రెన్యువల్ చేసుకున్నారా? లేదా ఆరా తీశారు. దాంతో పాటు పబ్‌లలో సౌండ్ పొల్యూషన్ లైసెన్స్, పోలీస్ పర్మిషన్, జీహెచ్ఎంసీ పర్మిషన్‌లను చెక్ చేశారు. పబ్, బార్లలోకి మైనర్లను అనుమతిచ్చి లిక్కర్ సప్లయ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. బార్లు, పబ్బులలో గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దీపావళి, ఛత్‌కు 804 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి, ఛత్ పండుగల సందర్భంగా 804 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్యరైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ప్రధాన రైల్వే స్టేషన్‌లు సికింద్రాబాద్, కాచిగూడ తదితర కేంద్రాల నుంచి షాలిమార్, రక్సాల్, జైపూర్, లాల్‌ఘర్, హిసార్, గోరక్‌పూర్, షిర్డీ, దానాపూర్, నిజాముద్దీన్, కటక్, అగర్తల, సంత్రగచ్చి తదితర ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు అత్యధికంగా రైళ్లను నడుపుతున్నట్లు తెలిపారు. మధురై, ఈరోడ్, నాగర్‌కోయిల్, కొల్లాం, బెంగళూరు, పన్వేల్, దాదర్ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నవంబర్ 30 వరకు దాదాపు 6,556 ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు.

పాట్నా టీటీఎఫ్‌లో ఆకట్టుకుంటున్న బుద్ధవనం స్టాల్

- తెలంగాణ పర్యాటక స్టాల్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి గజేంద్ర సింగ్‌షెకావత్



బుద్ధవనం ప్రాజెక్టు స్టాల్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్. చిత్రంలో పటేల్ రమేష్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో జరుగుతున్న ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్(టీటీఎఫ్)లో తెలంగాణ పర్యాటక సంస్థ ఏర్పాటు చేసిన నాగార్జునసాగర్ బుద్ధవనం ప్రాజెక్ట్ పలువురిని విశేషంగా ఆకట్టుకుంటోంది. బిహార్ రాజధాని పాట్నాలో సామ్రాట్ కాంప్లెక్స్, జ్ఞాన్‌భవన్‌లో తెలంగాణ టూరిజం-బుద్ధవనం స్టాల్‌ను మంగళవారం కేంద్రపర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ప్రారంభించారు. పాట్నా టీటీఎఫ్‌లో బుద్ధవనం, బౌద్ధవారసత్వ థీమ్‌పార్కుతోపాటు యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లాలోని పాలంపేట్‌లోని రామప్ప దేవాలయం, హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ప్రపంచ వారసత్వ స్మారక చిహ్నాలను ఈ సందర్భంగా గజేంద్రసింగ్ షెకావత్ సందర్శించారు. ఆయా పర్యాటక కేంద్రాల చారిత్రాత్మక ప్రాశస్త్యాన్ని తెలుసుకుని త్వరలో తెలంగాణకు రానున్నట్లు తెలిపారు. తెలంగాణను ప్రపంచస్థాయి గమ్యస్థానంగా అభివృద్ధి చేసే విషయాలపై సమగ్రంగా చర్చించేందుకు ఢిల్లీలోని తన కార్యాలయానికి రావాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డిని ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా బౌద్ధచరిత్రకారుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలంగాణలోని పర్యాటక కేంద్రాల ప్రాధాన్యతను విశ్లేషించారు. కార్యక్రమంలో పర్యాటక సంస్థ జనరల్ మేనేజర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు


జగద్గిరిగుట్ట ప్రాంతంలో రోడ్డుపై పారుతున్న మురికినీరు

కుత్బుల్లాపూర్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అనేక ప్రాంతాల్లో దారుణంగా మారింది. అనేక బస్తీలు, కాలనీలలో మురికినీరు నిండిపోయి మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ వ్యవస్థను వాటర్ వర్క్స్‌కు బదలాయించినప్పటి నుంచి ఈ పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రధానంగా జీడిమెట్ల ప్రాంతలోని సుభాష్‌నగర్, రామిరెడ్డినగర్, జగద్గిరిగుట్ట, సూరారంకాలనీ ఓంజెండా, సాయిబాబానగర్ ప్రాంతాల్లో నిత్యం మురికినీరు రోడ్డుపైనే పారుతున్నాయి. అనేక చోట్ల మ్యాన్‌హోల్స్ మూతలు లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

వాటర్ వర్క్స్ మేనేజర్, ఉన్నతస్థాయి అధికారులు కాంట్రాక్టర్‌లతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతూ పనులు చేపట్టకపోయినా నెలవారి వారికి లక్షల రూపాయాల బిల్లులు చెల్లిస్తున్నారు. మురికినీరు రోడ్డుపై పారుతున్నాయని ఫిర్యాదు చేసినా ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. సుభాష్‌నగర్ ప్రధాన రహదారిలో నిత్యం మురికినీరు పొంగి పొర్లుతుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు వాపోతున్నారు. జగద్గిరిగుట్టలోని అనేక బస్తీలలో కూడా ఇదే దుస్థితి నెలకొంది.

జంట సర్కిళ్లలో అస్తవ్యస్తంగా చెత్త సమస్య

- అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం
- ఆచరణకు నోచుకోని పారిశుధ్య నిర్వహణ
- వాహనాల్లో తీసుకువచ్చి రోడ్డుపైనే డంపింగ్

కుత్బుల్లాపూర్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయింది. ఎప్పటికప్పుడు విధులు సక్రమంగా నిర్వహించాల్సిన జీహెచ్ఎంసీ ఏఎంహెచ్ఓలు విధి నిర్వాహణలో సరైన పద్ధతిలో వ్యవహరించకపోవడంతో జవాన్లు, ఎస్ఎఫ్ఏలు, కిందిస్థాయి సిబ్బంది విధులకు హాజరైనా పనిచేయడంలో నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారు. సమయానికి రావడం సమయానికి వెళ్లే పద్ధతినే పాటిస్తున్నారే గాని పారిశుధ్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుందామన్నా ఆలోచనరాకపోవడం విచారకరం. ముఖ్యంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్‌నగర్, గంపలబస్తీ, రామిరెడ్డినగర్, చింతల్, వాణినగర్, సూరారంకాలనీ, సాయిబాబానగర్ ప్రాంతాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా గాజులరామారం సర్కిల్‌లో పారిశుధ్యం మరింత దారుణంగా మారింది. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అనేక బస్తీలు, కాలనీలలో చెత్త పేరుకుపోతుంది.


రాంకీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ సమీపంలో చెత్త చెదారం


గాజులరామారం సర్కిల్ హెచ్ఎంటీ పైప్‌లైన్ రోడ్డులో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

మురికి నీరంతా రోడ్డుపైనే పారుతున్నాయి. రోడామిస్త్రీనగర్, నెహ్రూనగర్ సుభాష్ చంద్రబోస్‌నగర్ గాజులరామారం ప్రాంతాల్లో చెత్త సమస్య తీవ్రంగా ఉంది. హెచ్ఎంటీ పైప్‌లైన్ రోడ్డులో రాంకీ సంస్థ నిర్వహిస్తున్న వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ సమీపంలో రోడ్డుపైనే వాహనాల్లో తీసుకువచ్చి చెత్తపోస్తున్నారు. ఉన్నతాధికారులు పారిశుధ్య నిర్వాహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నా ఇక్కడ మాత్రం ఆచరణకు నోచుకోవడం లేదు.

ఈ నెల 23 నుంచి రోడ్డు పక్కన పేరుకుపోయిన కుప్పలను తొలగించాలని ఆదేశాలు ఉన్నాయి. కాంట్రాక్టర్‌లతో అధికారులు సన్నిహితంగా స్నేహపూర్వకం గా ఉంటూ పనులు చేసినా చేయకపోయి నా పనిచేపట్టినా చేపట్టకపోయినా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో జంట సర్కిళ్లలో చెత్తసమస్య తీవ్రంగా ఉంది.

ఫంక్షన్ హాల్ స్థలాన్ని కాపాడాలి


రాజీవ్‌గాంధీ ఫంక్షన్‌హాల్ స్థలంలో పైప్‌లతో నిర్మిస్తున్న షెడ్డు

షాపూర్‌నగర్, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ సర్వే నంబరు 49లో రాజీవ్‌గాంధీ మ్యారేజ్ ఫంక్షన్ హాల్‌కు ప్రభుత్వం కేటాయించిన 2వేల గజాల స్థలాన్ని కబ్జాదారులు ఆక్రమించి, కబ్జా చేసి, నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో జిల్లా కలెక్టర్, కుత్బుల్లాపూర్ తహశీల్దార్, గాజులరామారం కమిషనర్ ద్వారా స్థలాన్ని రాజీవ్ గాంధీ ఫంక్షన్‌హాల్ కోసం కేటాయించారు. మంగళవారం ఆల్ ఇండియా దళితసేన జాతీయ అధ్యక్షులు డాక్టర్ అవిజే జేమ్స్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దళితులకు కేటాయించిన ఆ భూమిని గుర్తు తెలియని వ్యక్తులు పైపులు వేసి, నిర్మాణం చేపడుతున్నారన్నారు. కబ్జాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ స్థలాన్ని రాజీవ్‌గాంధీ ఫంక్షన్‌హాల్ కేటాయించి, ఎస్సీలకు ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ విషయాన్ని ఏప్రిల్ 26న ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించడం జరిగిందన్నారు.

తాగునీటి సమస్యను తీర్చండి

గాజులరామారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ రావినారాయణ రెడ్డినగర్ ఈస్ట్‌లో జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ రావుల శేషగిరి పర్యటించారు.

అనంతరం బస్తీలో నెలకొన్న నీటి సమస్యను తీర్చాలని స్థానికులు జలమండలి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే కొత్త పైప్‌లైన్‌లు వేసి, తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని అధికారులు వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ రోహిణి, నాయకులు మురళీ కృష్ణ, భాస్కర్, నారాయణ, రావినారాయణ రెడ్డినగర్ ఈస్ట్ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరి, అధికారులు

శామీర్‌పేట్‌కు మెట్రో సదుపాయం కల్పించాలి


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రతినిధులు

అల్వాల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైల్ ఫేజ్-2లో భాగంగా ప్యారడైజ్ నుంచి కొంపల్లి-మేడ్చల్ వరకు, జూబ్లీ బస్టాండ్ నుంచి అల్వాల్ మీదుగా శామీర్‌పేట్ వరకు మెట్రోరైల్ సదుపాయాన్ని కల్పించాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మైనంపల్లి హనుమంతరావుతో కలిసి మంగళవారం సచివాలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రణాళికలో ఉన్న జూబ్లీ బస్టాండ్ నుంచి శామీర్‌పేట్ వరకు సింగిల్ డెక్ ఫ్లైఓవర్‌ను డబుల్ డెక్ ఫ్లైఓవర్‌గా మార్చాలని కోరారు. నగరం మొత్తం మెట్రో విస్తరించినప్పటికీ ఉత్తరానా ఏ ప్రాంతానికీ మెట్రో సదుపాయం లేదన్నారు. ఇది చాలా అన్యాయమని, తమ ప్రాంతానికీ మెట్రో రైలు సదుపాయం కల్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి శ్రీధర్‌బాబు వారికి హామీ ఇచ్చారు. అక్టోబరు 27న సీఎంతో జరిగే పీఏసీ సమావేశంలో ఈ విషయాన్ని ఎజెండాలో చేర్చాలని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీకి సూచించారు. మంత్రిని కలిసిన వారిలో సమితి ప్రతినిధులు వి.మహేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, జార్జ్, మోహన్‌రెడ్డి, చిరంజీవి, రాఘవేందర్, నార్త్ అల్వాల్ అసోసియేషన్ సభ్యులు భూపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, గిరిధర్‌రావు, దేవేందర్‌రెడ్డి తదితరులున్నారు.

పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జి.ఆశన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపా రు. ఈ పథకం ద్వారా కుల వృత్తిదారులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తుందన్నారు. వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారులు, చెప్పులు కుట్టువారు, మేస్త్రీ, బుట్టలు, చాపలు, చీపుర్లు తయారీదారులు, కొబ్బరి పీచు అల్లేవారు, బొమ్మల తయారీదారులు, మంగలి, పూలమాలలు అల్లేవారు, రజకులు, టైలర్, మత్స్యకారులు, వలలు తయారుచేసే వారు అర్హులన్నారు.

చేతులు, పనిముట్లతో పనిచేస్తూ, కుటుంబ సంప్రదాయ వృత్తుల్లో నిమగ్నమైన హస్తకళాకారులు, వృత్తికళాకారులు పథకంకోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ తేదీ నాటికి దరఖాస్తుదారు డి వయసు కనీసం 18 ఏళ్లు ఉండాలని, గత ఐదేళ్లలో స్వయం ఉపాధి, వ్యాపా ర అభివృద్ధికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద రుణం పొందకుండా ఉండాలన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే సాయం అందుతోందన్నారు.

సరైన సౌకర్యాలు కల్పించకుంటే చర్యలు

- కమిషనర్ నేరెళ్ల శారద

నిజాంపేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణ కాలేజీని తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం సందర్శించారు. అనంతరం గత రెండు రోజుల క్రితం ఇంటర్ విద్యార్థిని అనూష ఆత్మహత్యకు గల కారణాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. గతంలో నేను ఈ కాలేజీని సందర్శించినప్పుడు చాలా ఫిర్యాదులు అందాయని, ఆ ఫిర్యాదుల్లో మీరు ఎన్ని పరిష్కరించారని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అనూష ఆత్మహత్య చేసుకున్న గదిని పరిశీలించి, విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించకపోతే ఇన్‌స్టిట్యూట్ అనుమతులు రద్దు చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు.


నారాయణ కాలేజీని సందర్శించిన మహిళా కమిషనర్, చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

చిట్‌ఫండ్ పేరుతో రూ. 2.65 కోట్ల మోసం

- బిచాణా ఎత్తేసిన నిర్వాహకుడు
- అరెస్టు చేసిన ఈవోడబ్ల్యూ పోలీసులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తన పరుతో ఓ చిన్న చిట్‌ఫండ్ సంస్థను ప్రారంభించి గత 30 ఏళ్లుగా స్థానికంగా చిట్టీలు వేసి పలువురి నమ్మకాన్ని చూరగొన్న నిర్వాహకుడు ఏకంగా రూ. 2.65కోట్లతో రాత్రికి రాత్రే ఉడాయించాడు. మోసపోయిన బాధితులు సైబరాబాద్ సీపీని ఆశ్రయించడంతో ఈవోడబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి, నిందితున్ని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈవోడబ్ల్యూ డీసీపీ కె. ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ చింతల్‌కు చెందిన మలినేని సీతారామయ్య తన అల్లుడు మురళీ కృష్ణతో కలిసి సోమశేఖర ఫిన్‌కార్ప్ చిట్ ఫండ్ పేరుతో ప్రైవేట్ చిట్టీలు నడిపిస్తున్నాడు. దానికి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు. గత 30 ఏళ్లుగా చిట్టీలు నడిపిస్తున్నాడు. దాంతో చాలా మంది అతని వద్ద రూ.1లక్ష నుంచి రూ.10 లక్షలు వరకు చిట్టీలు వేశారు.

ఇటీవల కాలంలో వేసిన చిట్టీల తాలూకూ రూ.2,65,94,670లు వసూలు చేశారు. ఇకపై చిట్టీల నిర్వహణను నిలిపివేస్తున్నామని, రెండు మూడు రోజుల్లో ఎవరికి ఇవ్వాల్సిన డబ్బులు వారికి ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తరువాత రాత్రికి రాత్రే కుటుంబం తో సహా.. బిచాణా ఎత్తేశారు. దాంతో గాజులరామారానికి చెందిన బాధితుడు రాజేష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీపీ ఆదేశాలతో ఈవోడబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు సీతారామయ్య ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. ట్రాన్సిట్ వారెంట్‌పై తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

బాలికపై లైంగిక వేధింపులు : పోక్సో చట్టం కింద వ్యక్తి అరెస్ట్

దుండిగల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ వ్యక్తిపై దుండిగల్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, ఈ నెల 19న రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బౌరంపేట్ ప్రాంతంలో ఓ ఐదేళ్ల బాలికపై తండ్రి స్నేహితుడే లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులు గోప్యంగా ఉంచారు. కానీ బాలిక ఒంటిపై గాయాలు ఉండటంతో వారు చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తీసుకు వెళ్లగా డాక్టర్లు దుండిగల్ పోలీసులకు సమాచారం అందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : కూన శ్రీశైలంగౌడ్

గాజులరామారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని కైసర్‌నగర్‌లో రూ. 15.50 లక్షలతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శ్రీశైలంగౌడ్ స్థానికులతో కలిసి మంగళవారం ప్రారంభించారు.

గతంలో కైసర్‌నగర్ వాసులు బస్తీలో రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. శ్రీశైలంగౌడ్ ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, జోనల్ కమిషనర్‌కు తెలియజేసి, ప్రత్యేక నిధులు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ తౌసిఫ్, జమీల్‌పాషా, జబ్బర్, రాములు, దావూల్, సలీమ్, రంగయ్య, షయాజ్, అబీబ్, రసూల్, కాజాబాయ్, మున్నా, అక్రమ్, ముక్తల్, అలీమ్, మహబూబ్, బుచ్చిరెడ్డి, మల్లేష్ రెడ్డి, శ్రీనివాస్, భవాని, మహిళలు పాల్గొన్నారు.


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

గుండెపోటుతో అయ్యప్పమాలధారు మృతి

దుండిగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బౌరంపేట్ గ్రామంలో అయ్యప్పస్వామి సన్నిదానంలో అయ్యప్పమాల ధరించిన బుచ్చిబాబు(47) అనే వ్యక్తి మంగళవారం ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బుచ్చిబాబు

బీసీ హక్కుల సాధన సమితి మహాసభను జయప్రదం చేయండి

నిజాంపేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న కాప్రాలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో జరిగే బీసీ హక్కుల సాధన సమితి మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా 3వ మహాసభను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకుడు పాలబిందెల శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టి, పూర్తి చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి, గ్రామ పంచాయితీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను తక్షణమే నిర్వహించాలన్నారు.



పాలబిందెల శ్రీనివాస్

ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్, బీసీ హక్కుల సాధనసమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి పాల్గొంటారని ఆయన తెలిపారు.

చెరుకుపల్లి కాలనీవాసులకు సీసీ రోడ్డు : కొలన్

జీడిమెట్ల, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి చొరవతో చెరుకుపల్లి కాలనీవాసులకు సీసీ రోడ్డు సమస్య తీరింది. కాలనీవాసులు రోడ్డు పాడు కావడంతో కొలన్ హన్మంత్‌రెడ్డి సంప్రదించారు. దీనిపై స్పందించిన ఆయన ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం స్థానికులు రోడ్డును ప్రారంభించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ మహ్మద్ జాకీర్, చెరుకుపల్లి కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మీసాల రాములు, జనరల్ సెక్రెటరి సూర్యబాబు, మల్లేష్, రాందాస్, సంగమ్మ, రాజు, అక్బర్‌హుస్సేన్, ఈశ్వర్,సుబ్బారావు, శ్రీనివాస్‌గుప్తా, వీరేష్ పాల్గొన్నారు.


సీసీరోడ్డును ప్రారంభిస్తున్న స్థానికులు

సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ వడ్డేపల్లి నర్సింహ్మా

కుత్బుల్లాపూర్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఎలాంటి సమస్యలున్నా వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ వడ్డేపల్లి నర్సింహ్మా తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు సాగుతున్నామన్నారు. ప్రస్తుతం నిధుల కొరత ఉన్నా, ఉన్నవాటితోనే ప్రారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు వంటి సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక నిధులను కేటాయిస్తామన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో డీసీ పలు విషయాలను వెల్లడించారు.


డీసీ వడ్డేపల్లి నర్సింహ్మా

ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: సర్కిల్ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రజా సమస్యలకు ఏవిధంగా పరిష్కారం చూపుతున్నారు.

డీసీ: జీహెచ్ఎంసీలో నిధుల కొరత ఉంది. నిధులు మంజూరైన వెంటనే ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఇప్పటికే గతంలో నిధులు మంజూరైన పనులు కొనసాగుతున్నాన్నారు. షాపూర్‌నగర్ రంగా భుజంగా థియేటర్ వద్ద జంక్షన్‌ను అభివృద్ధి పనులు, ఫాక్స్‌సాగర్ కొంతభాగం 100 అడుగుల రోడ్డును నిర్మించడానికి చర్యలు చేపడుతున్నాం. రామిరెడ్డినగర్‌లో పార్కు పనులు కొనసాగుతున్నాయి. రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి త్వరలోనే ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి:పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. ఏవిధంగా పరిష్కరిస్తారు.

డీసీ: పారిశుధ్య నిర్వాహణ కోసం అనూహ్య రీతిలో కొత్త పద్ధతులను చేపట్టామని, చెత్త నిల్వ ఉన్న పాయింట్‌లను తొలగించి పరిశుభ్రంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నామని, ప్రతిరోజు అన్ని ప్రాం తాల్లో పర్యటిస్తూ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నామన్నారు. సిబ్బంది కొరత కూడా ఉందని, ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ నెల 23 నుంచి 29 వరకు జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి: అనేక ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. వీటిని అరికట్టడానికి ఏమి చర్యలు తీసుకుంటున్నారు.

డీసీ: అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టారు. అదేవిధంగా ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను కూడా తీసుకుని ఇష్టానుసారంగా నిర్మించే వారికి నోటీసులు జారీ చేస్తున్నామని, కూల్చివేతలకు ఎస్‌టీఎఫ్‌కు పంపిస్తున్నామన్నారు. అధికారులు ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఆంధ్రజ్యోతి: ప్రజా పాలన పేరుతో ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా.

డీసీ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన వారందరికి అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనేకమంది ఇప్పటికే కార్యాలయానికి వచ్చిన వస్తున్నారు. అర్హులైన వారిని దరఖాస్తు చేసుకోమని చెబుతున్నామని తెలిపారు.

కాచిగూడ- తిరుపతి స్పెషల్ రైలు రద్దు

బర్కత్‌పుర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కాచిగూడ- తిరుపతి స్పెషల్ రైలుకు ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ తెలిపారు. ఈ నెల 29, నవంబర్ 5, 12వ తేదీలలో కాచిగూడ - తిరుపతి (07063) స్పెషల్ రైలును రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ రైలు కాచిగూడ నుంచి ఆయా తేదీలలో రాత్రి 10.30కు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.10 నిముషాలకు తిరుపతి చేరుకుంటుందని, అయితే ప్రయాణికులకు ఇది సౌకర్యంగా లేకపోవడం వల్ల టికెట్ బుకింగ్ చేసుకోలేదని తెలిపారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి-కాచిగూడ (07064) ఈ నెల 30న నవంబర్ 6, 13వ తేదీలలో ఈ స్పెషల్ రైలు బయలుదేరనున్నదని, వీటిని కూడా రద్దు చేసినట్లు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన తెలిపారు.

కమ్మ సేవాసంఘం నూతన కమిటీ ఎన్నిక

నిజాంపేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్ కమ్మ సేవాసమితి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్యక్షునిగా వేదగిరి పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనాథ్, ఉపాధ్యక్షులుగా సత్యానారాయణ, వాసు, శ్రీనివాసురావు, సులోచన, సహ అధ్యక్షునిగా విజయ్‌భాస్కర్, కార్యదర్శులుగా మురళీకృష్ణ, కోటేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగేశ్వరరావును కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తి, అట్లూరి రమేష్, శివాజీ, రవీంద్రనాథ్ ఠాగూర్, సైదారావు, శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజన జాతి పోరాట వీరుడు కుమరం భీం

నిజాంపేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జల్ జంగిల్ జమీన్ అనే నినాదాన్ని ఆయుధంగా చేసుకొని ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన యోధుడు కుమరం భీం అని సీపీఐ బాచుపల్లి మండల కార్యాదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. కుమరం భీం జయంతి సందర్భంగా నిజాంపేట్‌లోని ఇంద్రన్న కాలనీలో సీపీఐ నాయకులతో కలిసి కొమరం భీమ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవిలో పుట్టి, అడవిలో బతికి, అడవి కోసం పోరాటం చేసి, అడవిలో చనిపోయిన అడవి బిడ్డ, గిరిజన జాతి పోరాట వీరుడు కుమరం భీం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశి యాదయ్య, శేషయ్య, సైదులు, కాజా, రషీద్, లక్ష్మయ్య, మల్లయ్యలు పాల్గొన్నారు.


కొమరం భీమ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

తుఫాన్ ప్రభావంతో 41 రైళ్లు రద్దు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 'దానా' తుఫాన్ ప్రభావంతో తూర్పుకోస్తా, దక్షిణమధ్యరైల్వే పరిధిలోని వివిధ మార్గాల్లో మొత్తం 41 రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఒడిశా తీర ప్రాంతంలో భారీవర్షాలు కురుస్తున్నందున ఈ నెల 23 నుంచి 27వ తేదీవరకు పలు రైళ్లను ఎక్కడికక్కడే నిలిపివేస్తున్నట్లు సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. ప్రధానంగా రద్దయిన రైళ్లలో భువనేశ్వర్, హౌరా, ఖరగ్‌పూర్, పూరీ, తదితర ప్రాంతాల నుంచి బెంగళూరు, రామేశ్వరం, సికింద్రాబాద్, తిరుపతి, షాలీమార్, మాల్దా, గౌహతి, కన్యాకుమారి, చెన్నై, గోవా తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు.